

నేడు మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్ష

బోథ్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ యాజమాన్యాలలో విద్యార్థులకు శుక్రవారం మండలస్థాయి గణితశాస్త్ర ప్రతిభ పరీక్షలు ఉన్నాయని, పరీక్షలలో విద్యార్థులు పాల్గొనాలని గణితఫోరం బోథ్ మండల కన్వీనర్ గజేందర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్ కుమార్ తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి పదవ తరగతి విద్యార్థులు ప్రతి మాధ్యమం నుంచి ముగ్గురు చొప్పున ఈ పరీక్షకు హాజరు కావచ్చు అని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లాస్థాయిలో జరిగే గణిత ప్రతిభా పరీక్షలు డిసెంబర్ 11న పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

వణుకుతున్న వసతి గృహాలు



ఆదిలాబాద్‌లోని కోలం ఆశ్రమ పాఠశాలలో దుప్పట్లు లేకుండా నిద్రిస్తున్న విద్యార్థులు

- జిల్లాలో వేగంగా పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- చలి తీవ్రతకు వణికిపోతున్న విద్యార్థులు
- అరకొర దుప్పట్లు.. ఇంకా సరఫరా కాని వెచ్చని దుస్తులు
- నేలపై నిద్రతో కంటి నిండా కునుకు కరువు
- జిల్లా అధికారులు స్పందిస్తేనే పేద విద్యార్థుల ఇబ్బందులు దూరం

ఆదిలాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెరిగిపోతున్న చలి తీవ్రతకు వసతి గృహాల విద్యార్థులు వణికిపోతున్నారు. పేద విద్యార్థుల సంక్షేమం కోసం యేటా ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులను ఖర్చు చేస్తున్నా సరైన ఫలితం కనిపించడం లేదు. ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో పేద, మధ్య తరగతి విద్యార్థులే ఎక్కువగా వసతిని పొందుతారు. అసలే కలుషిత ఆహారంతో అవస్థలు పడుతున్న వసతి గృహం విద్యార్థులు చలితో వణికిపోతున్నారు. రాత్రుళ్లు చలి తీవ్రత.. ఉదయమే చన్నీళ్ల స్నానాలతో బెంబేలెత్తి పోతున్నారు. విరిగిన తలుపులు, పగిలిన కిటికీలతో చలి గాలుల తీవ్రతకు తట్టుకోలేక పోతున్నారు. కస్తూర్బా మోడల్ పాఠశాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, గిరిజన ఆశ్రమ పాఠశాల పరిస్థితి మరి దారుణంగా కనిపిస్తోంది. కొత్తగా ఏర్పడిన గురుకుల పాఠశాలలు కూడా తాత్కాలిక భవనాల్లోనే కొనసాగడంతో కనీస వసతి లేక అవస్థలు తప్పడం లేదు. గత వారం రోజులుగా జిల్లాలో చోటు చేసుకుంటున్న వాతావరణ మార్పులతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోతున్నాయి. దీంతో గురువారం జిల్లా గరిష్ఠ సగటు ఉష్ణోగ్రత 28.3 కాగా కనిష్ఠంగా 9.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే భీంపూర్ మండలం అర్లి(టి)లో 8.7, జైనథ్, మావల, ఆదిలాబాద్ రూరల్ మండలాల్లో 10 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నవంబరులోనే పరిస్థితులు ఇలా ఉంటే డిసెంబరులో చలి తీవ్రత ఎలా ఉంటుందోనని విద్యార్థులు వణికిపోతున్నారు. అయితే శీతాకాలం ప్రారంభంకాగానే విద్యార్థులకు అవసరమైన దుప్పట్లు, స్వెట్టర్లు, దోమ తెరలను సరఫరా చేయాల్సి ఉంటుంది. కానీ ఇప్పటి వరకు అధికారులు చర్యలు తీసుకున్నట్లు కనిపించడం లేదు. చాలా వసతి గృహాల్లో వేడినీటి సౌకర్యం లేక విద్యార్థులు చన్నీళ్ల స్నానంతో చలికి తట్టుకోలేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

వెచ్చని దుస్తుల జాడేలేదు

శీతాకాలం ప్రారంభమై దాదాపుగా నెల రోజులు గడుస్తున్నా వెచ్చని దుస్తుల జాడే

(మిగతా 6వ పేజీలో)





జిల్లా ప్రగతికి తోడ్పాటునందించాలి : కలెక్టర్



జిల్లా కలెక్టర్‌ను సన్మానిస్తున్న అధికారులు

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా ప్రగతికి గెజిటెడ్ అధి కారులందరూ తోడ్పాటునందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా కోరారు. గురువారం ఇటీవల నూతనంగా ఎన్నికైన తెలంగాణ గెజిటెడ్ అధికా రుల సంఘం నేతలు అధ్యక్ష, ప్రధానకార్య దర్శు లు శివకుమార్, డాక్టర్ రామారావ్ రాథోడ్ నేతృత్వంలో కలెక్టర్‌ను చాంబర్‌లో మర్యాద పూర్వకం గా కలిశారు. కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి గెజిటెడ్ అధికారుల సహకారం ఎంతో అవసరమని, రాష్ట్ర ప్రభు త్వ లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు, రాష్ట్రంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో టీజీఓ అధ్యక్షులు కె.శివ కుమార్, కార్యదర్శి రామారావ్, అసోసియేషన్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, కోశాధికారి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు రాజేషుడు, వామన్‌రావ్, అరుణ్, సంయుక్త కార్యదర్శి అనిల్, ప్రచార కార్యదర్శి సంతోష్ కుమార్, కార్యాలయ కార్యదర్శి ధర్మేందర్, సాంస్కృతిక కార్యదర్శి రజనీకాంత్ రెడ్డి, క్రీడల కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు భగత్ రమేష్, సరోజ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం..

ప్రతిఒక్కరూ యోగాను దినచర్యలో భాగం చేసుకో వాలని, ప్రతి పాఠశాలలో విద్యార్థులకు యోగా శిక్షణ కార్య క్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో యోగా శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యవం తమైన జీవితానికి యోగా ఎంతో ముఖ్యమన్నారు. ఆయుష్ సేవలు ప్రతీ పాఠశాలలకు ఎంతో అవసరమని, అందుకు పాఠశాల, కళా శాలలో యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్ర మంలో రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, జిల్లా వైద్యాధికారి నరేందర్, డాక్టర్ చందు, ఆయుష్ విభాగపు వైద్యాధికారి వాణి, సుధాకర్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్

బోథ్ : మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన విద్యార్థులు ఇటీవల జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్టు పోటీల్లో ప్రతిభ కనబరిచారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడంతో వారికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా చేతుల మీదుగా జ్ఞాపికను అం దుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మహేందర్, సైన్స్ ఉపాధ్యాయులు ఈదుగాం రాజేశ్వర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలినడకన వెళ్తూ వైద్యం



వాగుదాటి మార్కగూడకు కాలినడకన వెళ్తున్న వైద్య సిబ్బంది

ఉట్నూర్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి) : ఉట్నూర్ మండలంలోని దొంగచింత గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మార్కగూడ గ్రామానికి దంతంపల్లి వైద్య సిబ్బంది కాలినడకన వెళ్లి గిరిజనులకు వైద్యం అందించారు. మార్కాగూడ గ్రామానికి వెళ్లే రహదారి సక్రమంగా లేకపోవడంతో తమ వాహనం నిలిపి వేసి వాగునీరు దాటుతు మార్కగూడ చేరుకొని అక్కడి గిరిజనులకు 35 మందికి వైద్యం అందించారు. డాక్టర్ అనురాధా వెంట వైద్య సిబ్బంది రాంబాయి, నూర్‌సింగ్, ప్రమోద్, ఎల్లవ్వ, పుష్పలున్నారు.

మా సమస్యలపై చర్చించండి

- తెలంగాణ అంగన్‌వాడీ టీచర్ హెల్పర్స్ అసోసియేషన్ సభ్యులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

నేరడిగొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ అసోసియేషన్ సభ్యులు గురువారం నేరడిగొండ మండల కేంద్రంలో గల బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్ జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్ల ఆయాల సమస్యలను అసెంబ్లీలో గళమెత్తాలన్నారు. గుజరాత్ రాష్ట్రం తరహాలో 3, 4 క్లాస్ ఎంప్లాయిలుగా తెలంగాణ రాష్ట్రప్రభుత్వం కూడా గుర్తించాలని, అంత వరకు టీచర్లకు గౌరవవేతనం రూ.26 వేలు, ఆయాలకు 13 వేలు అందించాలన్నారు. ఆదిలా బాద్ జల్లా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల తర ఫున డిసెంబర్ 9వ తేదీ నుంచి జరిగే తెలం గాణ అసెంబ్లీ సమావేశాల్లో గళమెత్తాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ తప్పకుండా అసెంబ్లీలో మాట్లాడుతానన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన డీఈవో

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి) : ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలను ఆర్‌పీఎల్ డీఈఓ ప్రణీత గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదిని పరి శీలించి, భోజనం అందించే ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందే విధంగా చర్యలు తీసుకుంటున్నా మని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలి : ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రానున్న శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవనంలో గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఖానాపూర్ నియోజకవర్గం శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా కృషిచేస్తామన్నారు. ఎమ్మెల్సీ సన్నాహక సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్‌మున్షి, టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, అధ్యక్షులున్నారు.

పాఠశాలను సందర్శించిన ఎస్‌వో

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ పట్టణంలోని హమీద్‌పురా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం సెక్టోరియల్ అధికారి జె.నారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, పఠన సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థుల హాజరుశాతం మధ్యాహ్న భోజనం నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా వంటగది పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రుణమాఫీ కల్పించాలని ధర్నా



అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు, నాయకులు

ఉట్నూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నేటికి ఏజెన్సీ ప్రాంత రైతుల పరిస్థితి అగమ్య ఘోచరంగా కనబడుతుందని కోరుకుంటు రైతులు, బీఆర్ఎస్ నాయకులు ఉట్నూర్ మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని పరిపాలన అధికారికి మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు భరత్ చౌహాన్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు గిరిజనేతరులు భూ ములు సాగుచేసుకుంటూ తమ జీవనాన్ని కొన సాగిస్తున్నారన్నారు. దశాబ్దాల కాలం నుంచి గిరిజనులతో పాటు గిరిజనేతరులు కూడా ఇక్క డ జీవనం సాగిస్తున్నారని, గిరిజనులతో పాటు గిరిజనేతరులు భూములు దున్నుకుంటున్నారన్నారు. అందరికీ సమాన అవకా శాలు కలిగించాల్సినటువంటి బాధ్యత ప్రభుత్వం పైన ఉన్నదని, గిరిజనేతరులు పహాణీల ద్వారా లోన్లు తీసుకున్నారు కాని వారికి రుణాలు మాఫీ కాలేదన్నారు. అదే విధంగా గిరిజ నులకు కూడా చాలా మందికి రుణాలు మాఫీ కాలేదని ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపించి గిరిజనులతో పాటు గిరిజనేతర రైతులకు పూర్తిగా రుణమాఫీ చేయాలని, రైతులందరికీ రైతుబంధు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ర్యాలీగా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని పరిపాలన అధికారికి ఈ సందర్భంగా మెమోరాండం అందించారు. కార్యక్రమంలో నాయకులు ప్రజలు రైతులు పాల్గొన్నారు.

తలమడుగు పోలీస్‌స్టేషన్ తనిఖీ



పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

తలమడుగు , నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోనరి స్థానిక పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ పోలీసు సిబ్బంది అప్రమ త్తంగా ఉండాలన్నారు. అదే విధంగ పోలీస్ స్టేష న్‌ను వచ్చిన ఫిర్యాదు వారితో మర్యాద పూర్వ కంగా మాట్లాడి వారి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి ఫిర్యాదు తీసుకోవాలన్నారు. అదే విధంగా ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేం దుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ సంబంధించిన రికార్డులను పరిశీ లించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసులు పెండింగ్‌లో ఉండకుండా ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో మొక్కలు నాటి, నీళ్ళు పోశారు. పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన సిబ్బంది కోటర్స్‌ను పరిశీలించగా శిథిలావస్థకు చేరుకున్నాయని ఎస్సై అంజమ్మ వివరించారు. కాగా పోలీస్‌స్టేషన్ ఆవరణ పచ్చదనం పరిశుభ్రంగా ఉండటంతో సిబ్బందిని అభినందించారు. ఇందులో ఎస్సై అంజమ్మ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

- డీఎంహెచ్‌ఓ నరేందర్ రాథోడ్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ నరేందర్

ఇచ్చోడ, నవంబరు, 28(ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది ప్రభుత్వ ఆసుప త్రుల్లో అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌ఓ నరేందర్ రాథోడ్ అన్నారు. గురువారం ఇచ్చోడ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో 7 పీహెచ్‌సీల వైద్య సిబ్బందితో వైద్యసేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలలో నిర్వహించే కార్యక్రమాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సాధన, వైద్యులు గజానంద్, కిరణ్ కుమార్, ఇచ్చోడ, గుడిహత్నూర్, నర్సాపూర్, పిట్టబొంగరం, బజార్‌హ త్నూర్, సోనాల, నేరడిగొండ మండలాల పీహెచ్‌సీల వైద్యా ధికారులు, 7 పీహెచ్‌సీల సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

- అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ కుడ్మెత మనోహర్



శిబిరాన్ని పరిశీలించిన అదనపు జిల్లా వైద్యాధికారి

ఇంద్రవెల్లి, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి) : విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ కుడ్మెత మనోహర్ అన్నారు. గురువారం మండలంలోని పాటగూడ గ్రామంలోని ఏకలవ్యమోడల్ గురుకుల పాఠశాలలో పిట్ట బొంగురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని డాక్టర్ కుడ్మెత మనోహర్ పరిశలించి, విద్యార్థుల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వరెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాలు, కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే ఉపాధ్యాయులకు గాని, వైద్యులకు గాని వెంటనే తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సౌరభం యాదవ్, వైద్యులు డాక్టర్ ప్రతాప్ నాయక్, డాక్టర్ పూజిత, హెచ్ఈవో రాథోడ్ గోకుల్, హెల్త్ సూపర్ వైజర్ జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

వణుకుతున్న వసతి గృహాలు

(5వ పేజీ తరువాయి)

కనిపించడం లేదు. అరకొర దుప్పట్లతోనే అధికారులు సరిపెడుతున్నారు. కొన్ని మండలాల్లో ఇద్దరు ముగ్గురు విద్యార్థులు కలిసి ఒకే దుప్పటి జత అందజేస్తున్నారని విద్యార్థులు పేర్కొంటున్నారు. దుప్పట్లు మందంగా లేకపోవడంతో చలికి తట్టుకోలేక పోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. కొంత మంది విద్యార్థులు ఇంటి నుంచి వెచ్చని దుస్తులను తెచ్చుకొని ధరిస్తున్నారు. ఇప్పటి వరకు వెచ్చని దుస్తుల సరఫరాపై అధికారులు దృష్టి సారించడం లేదు. అలాగే దోమ తెరలు కూడా లేకపోవడంతో తరచూ విద్యార్థులు అనారోగ్యంబారిన పడుతున్నారు. శీతాకాలంలో విద్యార్థుల స్నానానికి వెచ్చని నీటిని అందుబాటులో ఉంచాల్సి ఉండగా జిల్లాలో ఏ వసతి గృహంలో వెచ్చని నీటిని అందిస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. వసతి గృహాల పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత లోపించడంతో దోమల బెడద విపరీతంగా పెరిగి పోయిందంటున్నారు. చలి తీవ్రతకు విద్యార్థుల చర్మం పొడిబారి రకరకాల చర్మ వ్యాధులబారిన పడుతున్నారు. ప్రభుత్వం వెచ్చని దుస్తులను అందించాలని పలువురు విద్యార్థులు కోరుతున్నారు.

కంటినిండా కునుకు కరువు

చాలీచాలని దుప్పట్లతో పాటు నేలపై నిద్ర విద్యార్థులకు కంటినిండా కునుకు లేకుండా చేస్తుందని చెబుతున్నారు. సరిపడా నిద్రలేకపోవడంతో తరగతి గదుల్లో విద్యార్థులు చురుకుగా కనిపించడం లేదు. నిద్రలేమితో అజీర్తి, మలబద్ధకం, పలు సమస్యలకు కారణమవుతోంది. పగిలిన కిటికీలు, విరిగిన తలుపుల నుంచి వీచే చలిగాలులతో నిద్రరావడం లేదని చెబుతున్నారు. గదిలోకి చలిగాలులు రాకుండా విద్యార్థులు తాత్కాలిక ఏర్పాట్లను చేసుకుంటున్నారు. చాలా వసతి గృహాలు ఇప్పటికీ అద్దె భవనాల్లోనే కొనసాగడంతో ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. అధికారులకు చెప్పుకోలేక విద్యార్థులు లోలోననే ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల జరుగుతున్న కలుషిత ఆహార ఘటనలతో అధికారులు కదిలినా చలి తీవ్రత నుంచి విద్యార్థులను కాపాడేందుకు చర్యలు తీసుకున్నట్లు కనిపించడం లేదు. కొన్ని వసతి గృహాల్లో గత ఏడాది క్రితమే సరఫరా చేసిన దుప్పట్లను తిరిగి అందజేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. కొత్తగా దుప్పట్లు, వెచ్చని దుస్తులను కొనుగోలు చేసి విద్యార్థులకు అందించేందుకు ఏర్పాట్లు చేయడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం ప్రారంభం

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దేశరక్షణలో భాగస్వాములు కావాలనే విద్యార్థులకు ఎన్‌సీసీ వేదికని కమాండింగ్ ఆఫీసర్ కల్నాల్ వికాస్ శర్మ అన్నారు. గురువారం డీటీసీలో ఎన్‌సీసీ 2వ వార్షిక శిక్షణ శిబిరం ప్రారంభించి శిక్షణ తీరున క్యాడెట్లకు తెలియజేశారు. ఈ సందర్భంగా కమాండింగ్ ఆఫీసర్ కల్నాల్ వికాస్‌శర్మ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పదిరోజుల పాటు 2వ వార్షిక శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 27న తొలిరోజు సర్టిఫికేట్స్ వెరిఫికేషన్ చేశామని, రెండోరోజు గురువారం శిక్షణ తీరు గురించి తెలియజేశామన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువకులకు సన్మానం

తలమడుగు , నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బరంపూర్ గ్రామానికి చెందిన యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారిని గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారి వివరాలు షేర్ల అఖిల్ (టీచర్), మారం సాయి (కానిస్టేబుల్), అలాగే ఆఫియా నిగర్ ముజీబ్, ఎల్టి రుత్విక్‌రెడ్డి మెడిసిన్ సీట్ సాధించినందుకు బరంపూర్ ఎంప్లా యీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ముజీబ్, గ్రామ పెద్ద లు కేదారీశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ కసులాల ప్రతాప్, వీడీసీ ప్రెసిడెంట్ గడు గు శ్రీనివాస్, మెరుగు రంజిత్‌రెడ్డి, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సంక్షేమమే పోలీసుల ప్రధాన లక్ష్యం

ఇంద్రవెల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆదివాసిల సంక్షేమమే పోలీసుల ప్రధాన లక్ష్యమని ఎస్సై దుబ్బాక సునీల్ అన్నారు. గురువారం మండలంలోని అనంతపూర్ గ్రామంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై ఆధ్వర్యంలో గ్రామంలోని ఆదివాసి కుటుంబాలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై దుబ్బాక సునీల్ మాట్లాడుతూ చలితీవ్రతతో ఇబ్బందులు పడుతున్న గిరిజనులకు ఉపయోగపడే విధంగా ఈ దుప్పట్లను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ సోము, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు పూర్క చిత్రు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘన్‌పూర్‌లో మొరం రోడ్డు పనులు ప్రారంభం



మొరం రోడ్డుపనులు ప్రారంభిస్తున్న దృశ్యం

బోథ్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో మంజూరైన మొరం రోడ్డు పనులను గురువారం మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి ప్రారంభించారు. గ్రామంలో ప్రజల అవసరాల నిమిత్తం ఈ రోడ్డుకు నాలుగు లక్షల రూపాయలు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే మరిన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులున చేపడతామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. మరిన్ని నిధులు నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్, మంత్రి సీతక్క సహకారంతో మంజూరు చేయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాజుల పోతన్న, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బత్తుల రమేష్, సోనాల పట్టణ అధ్యక్షులు అనిల్, అంకుష్ తదితరులు ఉన్నారు.

కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన సదస్సు

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : లింగ వివక్షత, లింగ సమానత్వం, మహిళలపై హింసకు వ్యతిరేకంగా అందరు కలిసి పోరాడాలని సఖి కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి అన్నారు. మహిళలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ప్రచారోద్యమం కార్యక్రమంలో భాగంగా గురువారం మావల కేజీబీవీలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్‌క్రైమ్, చట్టాలు, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ యశోద పాల్గొన్నారు.

ముథోల్ ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టాలి

ముథోల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవన నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో సెక్రటేరియట్‌లో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు విన్నవించారు. ముథోల్‌లో ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి పనులు త్వరితగతిన చేయాలని ఆదేశాలు ఇవ్వాలని మంత్రిని కోరారు. దీనికి కావాల్సిన నిధులు కూడా మంజూరు చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పేర్కొన్నారు.

మహాత్మా జ్యోతి బాపూలేకు ఘన నివాళి

దిలావర్‌పూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గురువారం మహాత్మా జ్యోతి బాపూలే 129 వర్ధంతిని కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మాలెపు కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముథోల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లో గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువుఉ మాట్లాడుతూ... సమ సమాజ స్థాపనకు, బడుగు, బలహీన వర్గాలకు విద్యను అందిస్తూ అన్నిట్లో సమాన హక్కుల కోసం పోరాడిన పూలే ఆశయ సాధనలో అందరం నడుద్దామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయన్న, దేవోజీ భూమేష్, వందేమాతరం, మోహన్, విజేష్, టి. రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాజ్యోతిబాపూలేకు నివాళి



నివాళులర్పిస్తున్న మాలి మహా సంఘం నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాజ్యోతి బాపూలే జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్న ప్రభుత్వం వర్ధంతిని మాత్రం నిర్వహించడం లేదని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే అన్నారు. గురువారం మాలీ సంఘం ఆధ్వర్యంలో పూలే వర్ధంతిని పురస్కరించుకొని ఎస్సీ కార్యాలయ ఆవరణలోని పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలో రుగ్మతలను దూరం చేయడంతో పాటు మహిళల చదువుకు ఆయన చేసిన కృషిని గుర్తిస్తూ జయంతితో పాటు వర్ధంతిని కూడా అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సాంబన్న షిండే, సతీష్, విజయ్, చంద్రశేఖర్, భాస్కర్, దేవిదాస్, స్వేరోస్ అధ్యక్షుడు పెంటపర్తి ఊశన్న తదితరులు పాల్గొన్నారు.

● **బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..**

బీసీ సంక్షేమ సంఘ భవనంలో పూలే వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మహాత్మా జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిక్కాలదత్తు మాట్లాడుతూ పూలేదంపతులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. అదేవిధంగా సమసమాజ స్థాపనకు కృషిచేసిన పూలే కృషిని గుర్తించి వర్ధంతిని కూడా అధికారికంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కలాల శ్రీనివాస్, అశోక్, ప్రశాంత్,శ్రీనివాస్, బండారి దేవన్న తదితరులు న్నారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే వర్ధంతిని నిర్వహించారు. బీసీస్టడిసర్కిల్ ఆవరణలోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యరంగంతో పాటు బాల్య వివాహాలపై ఆయన సేవలను నేతలు కొనియాడారు. ఇందులో నాయకులు గుడిపెల్లి నగేష్, రఫిక్, శ్రీధర్, చరణ్‌గౌడ్, శ్రావణ్ నాయక్, శ్రీలేఖ పాల్గొన్నారు.

తలమడుగు : సామాజిక న్యాయం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, స్త్రీ విద్య కోసం మహాత్మా జ్యోతిబాపూలే దంపతులు చేసిన సేవలు చిరస్మరణీయమని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే అన్నారు. తలమడుగు మండలం సుంకిడి ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుకుమార్ పెట్కులే మాట్లాడుతూ స్త్రీ విద్య కోసం జ్యోతిబాపూలే తన భార్య సావిత్రిబాయిను ఇంట్లోనే అక్షరభ్యాస నేర్పించి భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయులుగా 1848లో పూణె నగరంలో మొదటి బాలికల పాఠశాలను ప్రారంభించి స్త్రీ సాధికారిత కోసం, స్త్రీల అభ్యున్నతి కోసం పూలే దంపతులు నాంది పలికారని, అంతేకాకుండా ఈ దేశంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాల కోసం రిజర్వేషన్లను ప్రతిపాదించింది. కూడా జ్యోతిబాపూలేనే అని, అందుకే ఆయన్ని గురువుగా బావించి భారత రాజ్యాంగ నిర్మాతన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో రిజర్వేషను ప్రతిపాదించి సామాజిక న్యాయం, సమ సమాజ నిర్మాణం కోసం కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుజాత, గజానన్, సంజీవరెడ్డి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మండంలోని బరంపూర్, కుచలాపూర్, సాయిలింగీ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు.

నార్నూర్ : దళిత బహుజనులకు విద్యనందించిన మహనీయుడు జ్యోతిబాపూలే సర్వంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.గజానంద్‌నాయక్ అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి వేడుకలను పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక ఉద్యమ పితామహుడు మహాత్మాజ్యోతి బాపూలే అని కొనియాడారు. అగణగారిన వర్గాల ప్రజలకు విద్యబోధన చేసిన మహనీయుడు జ్యోతిబా పూలే ఆశయాలను కొనసాగించాలని వారి వెంట గ్రామప్రజలున్నారు.

ఆదివాసులకు ఆదర్శం మడావి తుకారాం



మడావితుకారాం

ఉట్నూర్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని ఆదివాసి గిరిజనులకు ఆదర్శంగా నిలిచిన మడావి తుకారం 26వ వర్ధంతి శుక్రవారం ఉట్నూర్ మండలంలోని లక్కేటిపేటలో నిర్వహిస్తున్నారు. చిన్నతనం నుంచి చురుకుగా చదువులు రాణిస్తున్న మడావి తుకారమ్ బీఎస్సీ డిగ్రీ పూర్తి కాగానే గ్రూప్-1 ఉద్యోగం సాధించి మొదటి సారిగా నిజామాబాద్ ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరిం చారు. అక్కడి నుంచి అంచలంచెలుగా ఎదిగిన ఆయన ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్‌గా పని చేసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనుల అభివృద్ధి సంక్షేమం కోసం ఆహర్నిషలు కృషి చేశారు. ఏజెన్సీ గ్రామాలలో విద్య వైద్య రంగాల అభివృద్ధితో పాటు సాగునీటి రంగాలను అభివృద్ధి చేయాలనే ప్రభుత్వానికి నివేదిం చారు. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆయనను ఐఏఎస్‌గా అప్‌గ్రేడ్ చేసింది. రాష్ట్రంలోని నల్గొండ, నిజామాబాద్ జిల్లాల కలెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించి ఆయన పేదల సంక్షేమానికి కృషిచేశారు. తెలంగాణ రాష్ట్ర వైభరాజ్ కార్పొరేషన్ మేనే జింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న కాలంలో అనారోగ్యానికి గురై మృతిచెందారు. ఆదివాసీ గిరిజనులతో తొలి ఐఏఎస్ అధికారిగా సమాజం అభివృద్ధి కోసం సేవలు అందించిన తుకారామ్‌ను గిరిజన యువత ఆదర్శంగా తీసుకుంటున్నారు. ఉట్నూ ర్ మండలంలోని లింగోజీతండా ఎక్స్‌రోడ్డు వద్ద దివంగత అధికారి తుకారం విగ్రహాంను ఏర్పాటు చేశారు. ప్రతిఏటా నవంబర్ 29న ఆయన సొంత గ్రామం అయిన లక్కేటిపేటలో గిరిజన సాం ప్రదాయ ప్రకారం కుటుంబ సభ్యులు తుకారం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామస్థుల ఆధ్వర్యంలో ఎక్స్‌రోడ్డులో తుకారమ్ విగ్రహం వద్ద కూడా గిరిజనులు పడుతుంది. కార్య క్రమం నిర్వహిస్తూ వస్తున్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌తో పాటు ఐటీడీఏ అధికారులు జిల్లా అధికారులు తుకారం ఎక్స్‌రోడ్డుకు చేరుకొని శుక్రవారం ఆయన విగ్రహం వద్ద నివాళులర్పిస్తారని నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు దీక్షాదివస్

● **మాజీ మంత్రి జోగురామన్న**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగురామన్న

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించాలని మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న పిలుపునిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలను వెల్లడించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో దీక్షాదివాస్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ సాధనే లక్ష్యంగా పద్నాలుగేళ్ల క్రితం అప్పటి ఉద్యమ నాయకుడు, మాజీ సీఎం కేసీఆర్ దీక్షను ప్రారంభించిన రోజును పురస్కరించుకొని దీక్ష దివాస్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో చేపట్టిన ఏర్పాట్లను మాజీ మంత్రి జోగురామన్న పర్యవేక్షించారు. దాదాపు రెండు వేల మంది పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొననున్న కార్యక్రమంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ మలిదశ ఉద్యమంలో కేసీఆర్ చేపట్టిన దీక్షకు ఎంతో ప్రాధాన్యత ఉందని, సమైఖ్య రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాన్ని ఖండిస్తూ ఆయన ఉద్యమానికి శంకారావం పూరించారని అన్నారు. కార్యక్రమంలో రౌతు మనోహర్, ఇజ్జగిరి నారాయణ, రోకండ్ల రమేష్, సాజిదొద్దిన్, యూనిస్‌అక్బాని, యాసంనర్సింగ్‌రావుమౌర్యసురేందర్, కలీమ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన ఖానాపూర్ పోలీసులు



ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన కల్యాణ్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

ఖానాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధ, కుటుంబ సమస్యలతో విసుగు చెంది చనిపోవాలని నిర్ణయించుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఓ వ్యక్తిని ఖానాపూర్ పోలీసులు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన కథనం ప్రకారం... మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన అల్లెపు కళ్యాణ్ అనే వ్యక్తి అప్పుల బాధతో కుటుంబ కలహాలతో విసుగు చెంది ఆత్మహత్య చేసుకునేందుకు గురువారం సాయంత్రం ఇంటి నుండి బయలుదేరాడు. ఇది గమనించిన అతని స్నేహితుడు 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వడంతో బ్లూ కోర్టు సిబ్బంది కళ్యాణ్‌కు నచ్చజెప్పేందుకు సెల్‌ఫోన్‌లో సంప్రదించారు. అయినా కళ్యాణ్ వినకపోవడంతో బ్లూకోర్టు సిబ్బంది ఎస్సై రాహుల్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో జరిగిన విషయాన్ని జిల్లా ఎస్పీ జానకి షర్మిల దృష్టికి తీసుకెళ్లిన ఎస్సై రాహుల్ ఎస్పీ సూచన మేరకు ఐటీ కోర్ బృందం సహాయంతో సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా కళ్యాణ్ జాడను వెతికి పట్టుకున్నారు. రెండు గంటలపాటు కళ్యాణ్ కోసం గాలించగా కడెం మండలం మాసాయిపేట శివారు ప్రాంతంలో ఖానాపూర్ పోలీసులకు కనిపించిన కళ్యాణ్ పోలీసులను చూసి పాత ఎల్లాపూర్ వరకు పరుగులు పెట్టాడు. దీంతో పాత ఎల్లాపూర్ శివారులో కళ్యాణ్‌ను పట్టుకున్న పోలీసులు ఆయనకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అందిన సమాచారంతో వెనువెంటనే స్పందించి ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన ఖానాపూర్ ఎస్సై రాహుల్, బ్లూ కోర్టు సిబ్బందిని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.

పకడ్బందీగా మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలి

నిర్మల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండలంలోని లోకేశ్వరం, రాజూర, మన్మద్ పాఠశాలలను గురువారం జిల్లా విద్యాధికారి రామారావు పటేల్ సందర్శించారు. పాఠశాలలోని మధ్యాహ్న భోజనం, పారిశుద్ధ్యం పరిశీలించి, వారికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చి ప్రతీ రోజు ముందుగా ఒక ఉపాధ్యాయుడు తిన్న తర్వాత పిల్లలకు వడ్డించాలని తెలియజేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ... విద్యార్థులు అందరూ సమయసారిని తయారు చేసుకుని దాని ప్రకారం చదువుకోవాలన్నారు. ప్రతీరోజు ఉదయం 4 గంటలకు లేచి చదువుకోవాలని తెలిపారు. ప్రతి ఉదయం ఒకరికొకరు విద్యార్థులు ఫోన్ చేసుకొని మేల్కొవాలని తెలియజేశారు. మళ్లీ రాష్ట్రంలో మన నిర్మల్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపి హ్యాట్రిక్ సాధించాలని, దానికొరకు ప్రతి విద్యార్థి చక్కగా చదువుకొని పాఠశాలకు మన జిల్లాకు పేరు తేవాలని కోరారు. మన్మద్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల యందు ఉన్న కిచెన్ గార్డెన్ సందర్శించి పూల మొక్కలు, కూరగాయల పెంపకం చూసి ఇంచార్జ్ ఉపాధ్యాయులు మల్కాగౌడ్, మండల విద్యాధికారి చంద్రకాంత్, ఉపాధ్యాయుల బృందాన్ని అభినందించారు. మన్మద్ పాఠశాలకు మొదటి సారిగా వచ్చినందుకు వారికి పాఠశాల ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి జే. రాజారాం, కే. రాజేందర్, బి. సురేష్‌రావు, ఏ. అశోక్ రెడ్డి, తదితరులు శాలువాతో సత్కరించారు.

జాతీయ సాధన సర్వే పరీక్ష విజయవంతం చేయండి

నిర్మల్ కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డిసెంబరు 4న నిర్వహించే జాతీయ సాధన సర్వే పరీక్ష విజయవంతం చేయాలని డీఈవో పి. రామారావు కోరారు. గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. 136 మందికి శిక్షణ ఇచ్చామని, 90 మంది పరిశీలకులను నియమించి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా పరీక్ష నిర్వహించాలన్నారు. ఏసీఈ సిద్ధ పద్మ, విజయ, రమణారెడ్డి, విజయ్ కుమార్, ఏఎంవో నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

రూమ్ టు రీడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గ్రంథాలయం ఏర్పాటు

భైంసా రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : భైంసా మండలంలోని దేగాం గ్రామంలో గురువారం ప్రైమరీ పాఠశాల రూమ్ టు రీడ్ ఆధ్వర్యంలో మోడల్ లైబ్రరీని ఎంఈవో మహేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో విద్యార్థులకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం ఆనంద దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విశ్వనాథప్ప, గ్రంథాలయ కోఆర్డినేటర్ మమత, గ్రామ ప్రజలు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలి

● **ఖానాపూర్ పోలీసుస్టేషన్‌తనిఖీలో డీఎస్పీ గంగారెడ్డి సూచన**

ఖానాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను చెప్పుకునేందుకు పోలీసుస్టేషన్ వచ్చిన ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెదలాలని ఖానాపూర్ పోలీసులకు నిర్మల్ డీఎస్పీ ఏ.గంగారెడ్డి సూచించారు. గురువారం ఖానాపూర్ పోలీసుస్టేషన్‌ను సందర్శించిన ఆయన పలు రికార్డులను తనిఖీ చేశారు. పోలీసుస్టేషన్ సిబ్బందితో పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్‌లో రికార్డులతో పాటు, సీడీ ఫైళ్లను పరిశీలించారు. అనంతరం పోలీసుస్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. సీఐ సైదారావు, ఎస్సై గైక్వాడ్ రాహుల్, పోలీసులు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర ముఠా అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి

జైనథ్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దీపాయిగూడ ఎక్స్‌రోడ్డు వద్ద అక్రమంగా గ్యాస్ సిలిండర్లు తరలిస్తున్న అంతర్‌రాష్ట్ర ముఠాను పోలీసులు గురువారం మధ్యాహ్నం కాపుకాసి పట్టుకున్నారు. అనంతరం జైనథ్ మండల కేంద్రంలోగల పోలీసు స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి మాట్లాడారు. జైనథ్ గ్రామ శివారులో గల హెచ్‌పీ గ్యాస్ గోదాం నుంచి సిలిండర్లను ఈనెల 21న అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో అద్దె వాహనం గ్యాస్ గోదాంకు వచ్చి తాళం పగులగొట్టి దానిలో ఉన్న 74 నిండు సిలీండర్లను దొంగలించారని అన్నారు. ఇందులో 64 నిండు సిలీండర్లు 10 ఖాళీ సిలీండర్లు ఉన్నాయని తెలిపారు. 10వేల నగదు, స్వాధీనం నిందితుల దగ్గర స్వాధీనం చేసుకున్నారు. సిలీండర్లు దొంగలించిన ఏ1 లా దురాం(24), ఏ2 ప్రకాష్ పొరుగు రాష్ట్రమైన రాజస్థాన్‌కు వెళ్తుండగా పట్టుకుని అరెస్టు చేశారు. జైనథ్‌రూరల్ సీఐ డి.సాయినాథ్, ఎస్సై పురుషో త్తం, ఏఎస్‌ఐ సిరాజ్‌ఖాన్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

నేరడిగొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేదప్రజలకు కార్పొరేట్ ఆసు పత్రుల్లో వైద్యం కోసమే ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించడం జరిగిందని బోథ్‌మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆడే వసంత్‌రావ్ అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆడే గజేందర్ ఆదేశాల మేరకు సావర్గం గ్రామానికి చెందిన మద్దెల లస్మన్నకి సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.60వేల విలువగల చెక్కును అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలు అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందితే ఆ బిల్లులను తమ దగ్గర సమర్పించి సీఎంఆర్ఎఫ్ అందుకోవా లని సూచించారు. కార్యక్రమంలో బ్లాక్‌అధ్యక్షులు అల్లూరి ప్రఫుల్‌చందర్‌రెడ్డి, యూత్ అధ్యక్షులు బద్దంపోతరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుతదితరులున్నారు.

ఘనంగా లాహుజి సాల్వే జయంతి

నార్నూర్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గురువారం స్వాతంత్ర సమరయోధుడు లాహుజి సాల్వే జయంతిని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీసర్పంచ్ బి.గజానంద్‌నాయక్ హాజరయ్యారు. సాల్వే విగ్రహాన్ని పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహనీయులు ఆశయ సాధనకి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ ఇన్‌చార్జీ చైర్మన్ సురేష్‌ఆడేదళితరత్న అవార్డు గ్రహిత నర్సింగ్ మోరేశేఖ్ అహమద్, కోరల మహేందర్ పాల్గొన్నారు.

కేసీఆర్, కేటీఆర్‌ల ఫ్లెక్సీ దహనం



కేసీఆర్, కేటీఆర్‌ల ఫ్లెక్సీని దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఆదిలాబాద్‌అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాపాలనను అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు చేయడం మంచిది కాదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మసంతోష్ అన్నారు. కేటీఆర్ వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ప్రజా సేవాభవన్ వద్ద కేసీఆర్, కేటీఆర్ ఫ్లెక్సీలను దహనం చేశారు. ఈ సందర్భంగా గిమ్మసంతోష్ మాట్లాడుతూ కేటీఆర్ దురహంకారంతో మాట్లాడుతున్నాడని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే అనుమతులిచ్చిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మసంతోష్‌రావు ఎస్‌సీ వింగ్ పాల్గొన్నారు.

మండల కార్యాలయాల కోసం భవనాల పరిశీలన

బోథ్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సోనాల మండలంగా ఏర్పాటైన నేపథ్యంలో మండల కేంద్రంలో ప్రభుత్వ భవనాల కోసం ప్రభుత్వ పాఠశాలలోని గదులను పరిశీలించారు. ప్రభుత్వ భవనాలు ఏర్పాటు చేసినట్లయితే తాత్కాలికంగా వివిధ ప్రభుత్వ భవనాలలో కార్యాలయాలను నిర్వహించే విధంగా వసతులను పరిశీలిస్తున్నారు. కార్యక్రమంలో సోనాల మండల సాధన కన్వీనర్ రామ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తులశ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ మురళీధర్, బీజేపీ మండల మాజీ కన్వీనర్ శుభసూర్యతో పాటు పలువురు గ్రామ పెద్దలు ఉన్నారు.

ఉయిక సంజీవ్ స్మరణ సభకు హాజరుకావాలి : తుడుందెబ్బ

నార్నూర్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): తుడుందెబ్బ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉయిక సంజీవ్ కొన్నిరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందిన సందర్భంగా రాష్ట్ర నాయకత్వం ఈ నెల 1వ తేదీన ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో స్మరణసభ పెట్టినందున రాష్ట్ర నలుమూలల జిల్లా నుంచి ఆదివాసులు అత్యధిక సంఖ్యలో హాజరు కావాలని గాదిగూడ మండల అధ్యక్షుడు చంద్రహరి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని లోకారి(కే) అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 9 తెగల ప్రజలు, ప్రజా సంఘ నాయకులు రాజకీయాలు అతీతంగా వచ్చి సభను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. వారి వెంట నాయకులు గౌరవ అధ్యక్షులు పూస బాజీరావు, ఆదివాసీ విద్యార్థి సంఘం కార్యదర్శి సంతోష్, గంగారాం సోనేరావు, మర్సకులలో తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

నార్నూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన ఆశ్రమ బాలికలు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలో ప్రతిభ కనబరిచినందుకు వారే రాష్ట్రీయ స్థాయి అథ్లెటిక్స్ సబ్‌జూనియర్ మీట్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం జాదవ్‌విఠల్, పీడీ ఆడే విశ్వనాథ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆత్రం సుజాత 100 మీటర్, 300 మీటర్, ఫస్ట్‌ప్లేస్, ప్రియాంక షార్ట్‌పుట్ ఫస్ట్‌ప్లేస్, స్వాతి కిడ్స్ జ్వల్లింగ్ త్రోలో ఫస్ట్‌ప్లేస్, మహేశ్వరి రన్నింగ్ పరుగు పందెంలో 300 మీటర్లు థర్డ్‌ప్లేస్, మౌనిక షాట్‌పుట్‌లో ఫస్ట్‌ప్లేస్, దివ్య జ్వల్లింగ్ ద్రోలో ఫస్ట్‌ప్లేస్, హెచ్‌ఎం, పీడీ ఆడే విశ్వనాథ్ పాఠశాల సిబ్బంది, వార్డెన్ పవర్ వనిత, నిలయ, రాజేశ్వర్, వసంత్, శంకర్, సూరత్‌సింగ్, ఉపాధ్యాయులు గురువారం రోజు సత్కరించి అభినందించారు. రాష్ట్రీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిబ్బంది ఉన్నారు.

మాలల సింహగర్జన సభ

నార్నూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద మాలమహానాడు జిల్లా అధికార ప్రతినిధి మెట్టు ప్రహ్లాద్ చంద్రశేఖర్ లోకండే వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 1న హైదరాబాద్‌లో జరిగే మాలల సింహగర్జన విజయవంతం చేయాలన్నారు. మాలల ఐక్యతను కాపాడాలి. మాలలు ఏకమై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దేవురావు సునిల్ చరణ్‌దాస్, బాలాజి, కాంబ్లే తదిత రులు పాల్గొన్నారు.

బోరు బావులకు నిధులు మంజూరు చేయండి

బోథ్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గిరి వికాసం పథకం కింద మంజూరైన బోరు బావులకు నిధులు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర గిరిజన సహకార ఆర్థిక అభివృద్ధి సంస్థ చైర్మన్ తిరుపతిని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి కోరారు. హైదరాబాద్‌లో సంక్షేమ భవన్‌లో కలిసి చైర్మన్‌కు వినతిపత్రం అందించారు. ఆదిలాబాద్ జిల్లాకు తొమ్మిది కోట్ల రూపాయలు రావాల్సిన నిధులు పెండింగ్‌లో ఉన్నాయని నిధులను రాబట్టేందుకు కృషి చేయాలని కోరారు. హైదరాబాద్‌లో సంక్షేమ భవన్‌లో కలిసి చైర్మన్‌కు వినతిపత్రం అందించారు. ఆదిలాబాద్ జిల్లాకు తొమ్మిది కోట్ల రూపాయలు రావాల్సిన నిధులను పెండింగ్‌లో ఉన్నాయని నిధులను రాబట్టేందుకు కృషి చేయాలని కోరారు. ఈ విషయాన్ని త్వరలోనే జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యే విధంగా చూస్తామని ట్రైకాన్ చైర్మన్ హామీనిచ్చారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ కొమరం కోటేశ్వర్, మడావి భీమరావు ఉన్నారు.

ఫోకస్



అభివృద్ధికి దూరంగా అనుబంధ గ్రామాలు

గ్రామంలో కాల్వలు లేక రోడ్లపైనే ప్రవహిస్తున్న మురికి నీరు

- మౌలిక వసతులకు నోచుకోని గిరిజనులు
- సమస్యలను విన్నవించినా పట్టించుకోని అధికారులు
- గ్రామ పంచాయతీగా ఏర్పడితేనే అభివృద్ధి సాధ్యమంటున్న ఆదివాసీలు
- లేదంటే ఎన్నికలను బహిష్కరిస్తామంటున్న గిరిజనులు



పూరి గుడిసెలోనే జీవిస్తున్న ఆదివాసీలు



గ్రామంలో సీసీ రోడ్డులేక గుంతలమయంగా ఉన్న మట్టి రోడ్డు

తలమడుగు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఆదివాసీ గ్రామాలకు అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నా ఆశయం నెరవేరడం లేదు. కొంతమంది అధికారుల నిర్లక్ష్యంతో ఆ నిధులు అనుబంధ గ్రామాలకు అందడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం పూర్వ ఝరి గ్రామ పంచాయతీ పరిధిలోని అనుబంధ గ్రామాలైన టోకిగూడ, షేర్‌గూడ ఆదివాసీ గిరిజన గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. మండలంలోని టోకిగూడ గ్రామంలో దాదాపు 400 ఆదివాసీ కుటుంబాలు గత వంద సంవత్సరాల క్రితం గ్రామం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఆ గ్రామానికి ఐటీడీ అధికారులు ఇప్పటివరకు సందర్శించిన దాఖలాలు లేవు. గ్రామంలో మురికి కాలువలు లేక రోడ్లపైనే మురికినీరు ప్రవహిస్తోంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది పలు రోగాలు ప్రబలుతున్నాయని గ్రామస్థులు చెప్తున్నారు. మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో వ్యవసాయ బావులు, చేతిపంపులు, గ్రామంలో పూర్వ బావి నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. ఆదివాసులు ఎంతో పవిత్రంగా జరుపుకునే దీపావళి పండుగకు గ్రామంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పలు ప్రాంతాల్లో గుంతలు ఉండగా వాటిని పూడ్చాలని చెప్పినా ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. విద్య, వైద్యం ఆదివాసులకు అందని ద్రాక్ష లాగే మారింది. గ్రామంలో ఎంతోమంది అర్హులు ఉన్నా ప్రభుత్వం అందించే పెన్షన్ డబ్బులు రావడం లేదని, వచ్చిన వారు కూడా పెన్షన్ డబ్బుల కోసం దాదాపు 5 కిలోమీటర్ల వరకు కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని గిరిజన ప్రజలు చెప్తున్నారు. కాగా, ఆదివాసీ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే టోకి గూడ, షేర్‌గూడ గ్రామాలున కలిపి కొత్త గ్రామ పంచాయతీ ఏర్పాటు చేస్తేనే అభివృద్ధి జరుగుతుందని గ్రామస్థులు తెలిపారు. కొత్త గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని రెండు గ్రామాల ప్రజలు కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారికి విన్నవిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కొత్త గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని ఆదివాసులు కోరుతున్నారు. లేనిపక్షంలో వచ్చే ఎన్నికలను బహిష్కరిస్తామని వారు డిమాండ్ చేస్తున్నారు.

కొత్త గ్రామ పంచాయతీ ఏర్పాటు చేస్తేనే అభివృద్ధి

- సీడం జనక్ పటేల్, ఆదివాసీ నాయకుడు



మండలంలోని టోకిగూడ, షేర్‌గూడ గ్రామాల ప్రజలు 1200 వరకు ఉన్నారని, 800 ఓటర్లు ఉన్నారని ప్రభుత్వ స్పందించి రెండు అనుబంధ గ్రామాలను కలిపి కొత్త గ్రామ పంచాయితీ ఏర్పాటు చేయాలని కోరారు. అప్పుడే అనుబంధ గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు.

ఆదివాసులపై చిన్నచూపు తగదు

- పెందూర్ సాకారం, గ్రామ పటేల్, టోకిగూడ



గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. గుంతల రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదు. తాగు నీటి సమస్యలను పరిష్కరించడం లేదు. మా గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయాలి. అప్పుడే మా గ్రామంలో అభివృద్ధి జరుగుతుంది.



- పురాతన బావి నుంచి నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్థులు



- గ్రామంలో అలంకార ప్రాయంగా ఉన్న రక్షిత మంచినీటి వాటర్ ట్యాంకులు



మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో బావి నుంచి మంచినీళ్లు తెచ్చుకుంటున్న ఆదివాసీలు

పనులు జరిగేచోట సూచికలేవీ?

భీంపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భీంపూర్ రోడ్డు పనులు గత కొన్ని రోజుల నుంచి సాగుతున్నాయి. రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా వంతెనలు నిర్మిస్తున్నారు. వంతెనల వద్ద డైవర్షన్ ఇచ్చారు. కానీ వంతెనల నిర్మాణం పనులు జరుగుతున్న చోట ప్రమాదం ఉంటుందని తెలిసి కూడా సదరు కాంట్రాక్టర్ ఎలాంటి సూచిక బోర్డులు పెట్టలేదు. దీంతో రాత్రి పూట వెళ్లే ప్రయాణీకులు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఎలాంటి సూచికల బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ద్విచక్ర వాహనంపై వెళ్లి బ్రిడ్జి నిర్మాణం కోసం తవ్విన గుంతలో పడి మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా సంబంధిత అధికారులు సదరు కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకొని ప్రమాదం ఉన్న చోట సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు మండల వాసులు కోరుతున్నారు.



పిప్పల్‌కోటి క్రాస్‌రోడ్డు పనుల వద్ద ఎలాంటి ప్రమాద సూచికలు లేని దృశ్యం

'ప్రజాభీష్టం మేరకే పరిశ్రమ ఏర్పాటు పనుల నిలిపివేత'

భైంసా, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు విషయంలో దిలావర్‌పూర్ ప్రాంత ప్రజాభీష్టానికి అనుగుణంగానే ప్రభుత్వం స్పందించి పనులను నిలిపివేయించిందని భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్ వెల్లడించారు. గురువారం భైంసాలో దిలావర్‌పూర్ ప్రాంతవాసులకు మద్దతుగా, ఇథనాల్ పరిశ్రమ పనులను నిలుపుదల చేయడాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జిల్లా ఇంచార్జీ మంత్రివర్యులు సీతక్క సంబంధిత విషయంలో చొరవచూపి ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుపై కొనసాగుతున్న వ్యతిరేకతను, నిరసనలను, ఆందోళనల కార్యక్రమాలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకవెళ్లిందని వివరించారు. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి ఇథనాల్ పనులను నిలిపివేయించే దిశగా నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిపారు. ఇందుకు అనుగుణంగానే జిల్లా అధికార యంత్రాంగం పనులను నిలుపుదల చేసేలా ఆదేశాలు జారీ చేసిందన్నారు. ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని చెప్పడానికి ఇథనాల్ పరిశ్రమ పనులను నిలిపివేయడం ప్రత్యక్ష ఉదాహరణగా పేర్కొనవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా ముథోల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇథనాల్ పరిశ్రమ పనులను నిలిపివేసేలా ప్రభుత్వం తీసుకున్ననిర్ణయాన్ని స్వాగతిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రంతో ప్రదర్శనలు చేపట్టి పాలాభిషేకం చేశారు.

- అధికారుల తీరు అభినందనీయం

ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ దిలావార్‌పూర్ ప్రాంత ప్రజానీకం చేపట్టిన రాస్తారోకో, ఆందోళనల సందర్భంగా జిల్లా యంత్రాంగం అవలంభించిన తీరు అభినందనీయమైనదని భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్ పేర్కొన్నారు. ప్రధానంగా జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ఘటన స్థలిలోనే మకాం వేసి పరిస్థితి ఉద్రిక్తతకు దారితీయకుండా ప్రణాళికబద్ధంగా వ్యవహరించిందని తెలిపారు. ఆగ్రహావేశాలతోనున్న ఆందోళనకారులు చేపట్టిన చర్యలను ఓర్పుతో నిరోధించే దిశగా చర్యలు చేపట్టి ఎలాంటి ఇతర అలజడులకు తావులేకుండా చూసిందన్నారు. ఇక కలెక్టర్ అభిలాష అభినవ్ ఎప్పటికప్పుడు పరిస్థితులను ప్రభుత్వానికి నివేదిస్తూ సమస్య పరిష్కరమయ్యేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించారన్నారు. మహిళా అధికారులైన కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిలలు వ్యవహరించిన తీరు, చేపట్టిన చర్యలతో సమస్య సద్దుమణిగిందన్నారు. ఇందులో భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ పలువురు డైరెక్టర్లు, కాంగ్రెస్ ప్రతినిధులు మురళిగౌడ్, ఫైసేకర్ సాయిలు, ప్రశాంత్, ఎస్‌డీ ఆలా, హైమద్ మోయిన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటంతో ప్రదర్శనలు నిర్వహిస్తున్న నాయకులు

భారత రాజ్యాంగంపై బీజేపీ బుల్డోజర్

- దళితులు, గిరిజనుల హక్కులు కాలరాస్తోంది
- రాజ్యాంగాన్ని ఆర్ఎస్ఎస్ ఎప్పుడు స్వీకరించ లేదు
- కేంద్రం సంపదను అదాని, అంబానీలకు దోచి పెడుతోంది: రాజ్యసభ మాజీ సభ్యురాలు బృందాకారత్

ఆదిలాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగంపై బీజేపీ ప్రభుత్వం బుల్డోజర్లను ప్రయోగిస్తోందని, పలుమార్లు సవరణలు చేస్తూ దళితులు, గిరిజనుల హక్కులను కాలరాసిందని రాజ్యసభ మాజీ సభ్యురాలు బృందాకారత్ మండిపడ్డారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సీఐటీయూ కార్యాలయ భవన ప్రారంభోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇది బీజేపీ ప్రభుత్వం కాదని, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వమని స్పష్టం చేశారు. 1950 నుంచి ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని ఎప్పుడు స్వీకరించ లేదని, దేశంలో మనుస్మృతి అమలు చేయాలని కోరుకుంటోందని వ్యాఖ్యానించారు. బీజేపీ ప్రభుత్వం రెండు తుపాకీ గొట్టాలతో పాలిస్తుందని ఇందులో ఒకదానికి కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా వినియోగిస్తుండగా మరోగొట్టంతో దేశంలో వివిధ వర్గాల మధ్య ఐక్యతను దెబ్బతీయడానికి ఉపయోగిస్తుందని తెలిపారు. ప్రతీ ప్రసంగంలో మైనార్టీలను లక్ష్యంగా చేసుకుంటుందని ధ్వజమెత్తారు. బ్రిటిష్ వారు ఏ విధం గానైతే విభజించి పాలించే సూత్రాన్ని పాటించారో అదే విధానాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత పదేళ్ల నుంచి అనుసరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో రాజ్యాంగం గురించి గొప్పలు చెప్పిన ప్రధాని మోదీ దానికి విరుద్ధంగా పాలన సాగిస్తున్నారని తెలిపారు. రాజ్యాంగం నిమ్నజాతులకు హక్కులు కల్పించిందని... కాని వాటిని వ్యతిరేకిస్తూ మనుస్మృతిని అమలు చేసేందుకు బీజేపీ పూనుకుంటుందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం 5వ షెడ్యుల్‌ను తొలగించి దేశంలోని అటవి సంపదను కార్పొరేట్లకు దొచిపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తుందన్నారు. పార్లమెంట్‌లో పోరాటం కారణంగా అటవీ హక్కు చట్టాన్ని సాధించామని, కానీ ప్రభుత్వం పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులపై కేసులలు నమోదు చేస్తోందని మండిపడ్డారు. ఇక్కడ బీజేపీ ఎంపీ ఉన్నప్పటికి పార్లమెంట్‌లో చేసిన ఆదివాసీ వ్యతిరేక చట్టాలకు అనుకూలంగా చేతులేత్తారని విమర్శించారు. ఆదివాసులు కార్మికులు, కర్షకులు కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాటం సాగించాల్సిన ఆవశ్యకత అవసరం ఉందని వివరించారు. కార్మికులు కనీసం వేతనం, సమాన హక్కుల కోసం పోరాడుతున్నా పెడచెవిన పెడుతుందని మండిపడ్డారు. కార్మికుల పోరాట ఫలితంగా సాధించిన చట్టాలను కేంద్రం నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికుల హక్కులను కాలరాస్తుందనిధ్వజమెత్తారు. అందరూ ఏకతాటిపై వచ్చి పోరాడితే ఏదైనా సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి బి.చంద్రకుమార్, సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం. సాయిబాబు, మాజీఎంపీ మీడియంబాబురావు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీఐటీయూ రాష్ట్రకార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జయలక్ష్మి, టీఏజీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసంసచిన్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనాల మల్లేష్, జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, కోశాధికారి కె.సునిత, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు, రైతు సంఘం అధ్యక్షుడు బండి దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న బృందాకారత్



సీఐటీయూ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బృందాకారత్, నాయకులు

ఖానాపూర్ అడవుల్లో పెద్దపులి!

- కడెం నుంచి మహారాష్ట్ర వెళ్తూ ఎగ్బాల్‌పూర్ అడవుల్లో తిష్ట
- ఎక్బాల్‌పూర్ అడవుల్లో పులి పాదముద్రలు గుర్తింపు
- ఉదయం, సాయంత్రం వేళల్లో అప్రమత్తంగా ఉండాలని ప్రజలను అప్రమత్తం చేస్తున్న అటవీ శాఖ అధికారులు



పులి పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ శాఖ సిబ్బంది



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ సెక్షన్ అధికారి

ఖానాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజుల క్రితం మహారాష్ట్ర ప్రాంతం నుంచి కవ్వాల్ అభయారణ్యం వైపు వెళ్తున్న క్రమంలో ఖానాపూర్ అడవుల్లో పెద్దపులి అలజడి సృష్టించిన ఘటన మరవక ముందే ఖానాపూర్ అడవుల్లో మరో బెబ్బులి తిష్ట వేసింది. గతంలో వచ్చిన పెద్దపులిని అటవీ శాఖ అధికారులు జానీగా గుర్తించారు. జానీగా పిలవబడే ఆ పెద్దపులి పశువుల మందలపై దాడి చేస్తూ పశువులను చంపి తినేది. కానీ ప్రస్తుతం ఖానాపూర్ అడవుల్లో సంచరిస్తున్న బెబ్బులి మాత్రం వన్యప్రాణులను మాటేసి వేటాడుతున్నట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. కడెం ప్రాంతం నుంచి మహారాష్ట్ర ప్రాంతం వైపు వెళ్తున్న ఈ పెద్దపులి మామడ వరకు వెళ్లి తిరిగివచ్చి ఎక్బాల్‌పూర్ అడవుల్లోనే తిష్ట వేసినట్లు చెబుతున్నారు. వారం రోజుల క్రితం మామడ మండలంలోని పరిమండల్ అడవుల్లో కనిపించిన పులి పాదముద్రలు తిరిగి గురువారం ఖానాపూర్ మండలం ఎక్బాల్‌పూర్ అడవుల్లో కనిపించినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం ఎక్బాల్‌పూర్ అడవుల్లో ఉన్న పెద్దపులి అత్యంత హుషారుగా ఉందని దాని కదలికలు కెమెరా ట్రాప్‌లకు సైతం చిక్కడం లేదని అధికారులు చెబుతున్నారు. ఈ పెద్దపులి ఇప్పటివరకు ఏ పశువులకు హాని కల్పించలేదని కేవలం వన్యప్రాణుల వేటనే కొనసాగిస్తుందంటున్నారు. సదరు పెద్దపులి అత్యంత హుషారుగా కదులుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు కోరుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఎట్టి పరిస్థితుల్లో అడవి మార్గాల గుండా వెళ్లవద్దని సూచిస్తున్నారు. ఖచ్చితంగా వెళ్లాల్సి వస్తే గుంపులు గుంపులుగా వెళ్లాలని ఒంటరిగా వెళ్లవద్దని చెబుతున్నారు. పెద్దపులి సంచరిస్తున్న విషయాన్ని నిర్ధారించుకున్న అటవీ శాఖ అధికారులు గురువారం సాయంత్రం పాత తర్లపాడ్, మస్కాపూర్, సుర్జాపూర్, ఖానాపూర్ పట్టణ శివారు ప్రాంతమైన డబుల్ బెడ్ రూమ్ కాలనీలలో ప్రజలకు అవగాహన కల్పించారు. 15 రోజుల వ్యవధిలోనే ఖానాపూర్ అడవుల్లో రెండు పెద్దపులులు సంచరించడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అడవులను ఆనుకుని ఉన్న వ్యవసాయ క్షేత్రాలకు చెందిన రైతులు అయితే ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. అడవులను ఆనుకొని ఉన్న గ్రామాలు అధికంగా ఉండడంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమై పెద్దపులి గ్రామ శివారు ప్రాంతాల్లోకి రాకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.2 । కనిష్ఠం 15.7



నిర్మల్
జిల్లా వార్తలు
8
శుక్రవారం 29 నవంబరు 2024

గర్భిణుల మరణాలు తగ్గించేందుకు యాక్షన్‌ప్లాన్



- హై పవర్ కమిటీ ఏర్పాటు
- హై రిస్క్ కేసుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్
- పౌష్టికాహారంపై ప్రతీ వారం సమీక్ష
- ప్రసూతి ఆసుపత్రిలో పది నెలల్లోనే వెయ్యికి పైగా నార్మల్ డెలవరీలు
- 35వేల మంది గర్భిణులకు ఓపీ వైద్య సేవలు

నిర్మల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గర్భస్థ మరణాలను అరికట్టేందుకు కలెక్టర్ నేతృత్వంలో యాక్షన్‌ప్లాన్ రూపొందించారు. జిల్లాలోని ప్రభుత్వ మెటర్నిటీ హాస్పటల్‌లో గర్భస్థ మహిళ కోసం ఈ ప్రత్యేక యాక్షన్‌ప్లాన్‌ను అమలు చేయనున్నారు. ఇందులో భాగంగా కలెక్టర్, హెచ్‌వోడితో పాటు వైద్యాధికారులు అలాగే ఈ ఆసుపత్రిలో పని చేస్తున్న సీనియర్ సిబ్బందితో కలిసి హైపవర్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో ప్రతీవారం మెటర్నిటీ ఆసుపత్రిలో జరుగుతున్న నార్మల్, సీజేరియన్ డెలవరీలపై అలాగే గర్భస్థ మహిళలకు అందిస్తున్న సేవలపై సమీక్షించనున్నారు. ఈ హైపవర్ కమిటీ ఆధ్వర్యంలో సమస్యలపై కూడా పరిష్కార మార్గాలను కూడా కనుగొననున్నారు. హై పవర్ కమిటీకి జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేయనున్నారు. ప్రసూతి ఆసుపత్రి పరిధిలోని ఎఎన్ఎం, ఆశావర్కర్లతో పాటు ఆసుపత్రి పరిధిలోని పీహెచ్‌సీ వైద్యులకు కూడా హై రిస్క్ గర్భిణీల గుర్తింపు బాధ్యతలను అప్పజెప్పనున్నారు. దీంతో పాటు గర్భస్థ మరణాల నియంత్రణ కోసం చేపట్టాల్సిన చర్యలపై వారానికి కొంతమంది వైద్యులకు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

హై రిస్క్ గర్భిణుల కోసం హెల్ప్‌లైన్ ఏర్పాటు

హై రిస్క్‌ను ఎదుర్కొంటున్న గర్భిణుల మహిళల సమస్యల పరిష్కారం కోసం ఇక్కడి మెటర్నిటీ ఆసుపత్రిలో హెల్ప్‌లైన్ డెస్క్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ హెల్ప్‌లైన్ డెస్క్‌లో ప్రత్యేకంగా నలుగురు ఎఎన్ఎంలతో పాటు కొంతమంది సిబ్బందిని నియమించారు. వీరు ఇప్పటికే గుర్తించబడిన హై రిస్క్‌లో ఉన్న గర్భిణులకు హెల్ప్‌లైన్ ద్వారా ఫోన్ చేసి వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోనున్నారు. అలాగే వారి సమస్యలకు అనుగుణంగా వైద్య సేవల వివరాలను తెలియజేస్తూ ఆరోగ్య జాగ్రత్తలపై సూచనలు అందిస్తున్నారు. ఇలా హెల్ప్‌లైన్ ద్వారా తెలుసుకుంటున్న సమస్యలపైనా, అందించిన వైద్య సేవల సూచనలపై ప్రతినెల ప్రత్యేకంగా సమీక్షించనున్నారు. గర్భిణీ మహిళలలో గుండె సంబంధిత సమస్యలు గుర్తించినట్లయితే వారికి వెంటనే ఇక్కడి మెటర్నిటీ హాస్పిటల్‌లో టూడీ ఏకో వైద్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. దీంతో పాటు పౌష్టికాహారంపై కూడా మహిళలకు తగిన సూచలను అందించనున్నారు.

రికార్డుస్థాయిలో డెలవరీలు

నిర్మల్ గవర్నమెంట్ మెటర్నిటీ ఆసుపత్రిలో రికార్డుస్థాయిలో డెలవరీలు జరిగినట్లు ఇక్కడి హస్పిటల్‌లో ఇన్‌చార్జీ తెలిపారు. జనవరి నెల నుంచి ఇప్పటి వరకు జరిగినటువంటి హాస్పిటల్‌లో మొత్తం 3276 మంది గర్భవతులకు వైద్యసేవలు అందించారు. వీరిలో నుంచి 1024 మంది గర్భవతులకు నార్మల్ డెలవరీలు చేశారు. కాగా 2250 మంది గర్భవతులకు శస్త్ర చికిత్సలతో డెలవరీలు చేశారు. గత 11 నెలల నుంచి 4141 మంది ఇన్ పేషంట్లకు వైద్య సేవలు అందించగా 35,930 మందికి ఓపి సేవలు అందించినట్లు డాక్టర్లు చెబుతున్నారు. మెటర్నిటీ ఆసుపత్రిలో 50 పడకల సౌకర్యం మాత్రమే ఉన్నప్పటికి ఇక్కడి డాక్టర్లు మాత్రం 80 నుంచి 90 మంది పేషంట్లను జాయిన్ చేసుకొని సేవలందిస్తున్నారు. కాగా మెటర్నిటీ హస్పిటల్‌లో ఎక్కువ మంది రోగులకు ఆరోగ్య శ్రీ పథకం కింద వైద్య సేవలు అందిస్తూ ఆ సేవల ద్వారా వచ్చే ఇన్సెంటివ్‌ను ఆసుపత్రి అభివృద్ధి కోసమే వెచ్చిస్తుండడం ప్రశంసలకు కారణమవుతోంది.

24 గంటల పాటు సేవలు అందుబాటులో..

గవర్నమెంట్ మెటర్నిటీ హస్పిటల్లో 24గంటల పాటు వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా గర్భిణీ మహిళల ప్రసవాలకు ప్రత్యేక సేవలు అందిస్తున్నాం. రికార్డుస్థాయిలో నార్మల్ డెలవరీలు చేస్తున్నాం. తప్పనిసరి పరిస్థితిలోనే శస్త్ర చికిత్సలు చేసి డెలవరీలు జరుపుతున్నాం. గర్భిణీ మహిళలకు మెరుగైన వైద్య సేవలు అందించడం లక్ష్యంగా పెట్టుకున్నాం. నార్మల్ డెలవరీలకే మొదలు ప్రాధాన్యతనిస్తున్నాం. గర్భిణీ మహిళల కోసం అవసరమయ్యే అన్ని రకాల సౌకర్యాలు హస్పిటల్‌లో అందుబాటులో ఉన్నాయి. ఎలాంటి మందుల కొరత లేదు.

- డాక్టర్ సరోజ, గవర్నమెంట్ మెటర్నిటీ ఆసుపత్రి ఇన్‌చార్జి, నిర్మల్

మన్మథ్ గ్రామంలో అఖండ సప్తాహ

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

నిర్మల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండలంలోని మన్మథ్ గ్రామంలో అఖండ సప్తాహ కొనసాగుతోంది. గురువారం 6వ రోజు కార్యక్రమంలో భాగంగా మన్మథ్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు చెందిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా నాట్యప్రదర్శనలు, నాటికలు, జోక్స్, పాటలు రాత్రి 9 గంటల నుండి 12 గంటల వరకు కొనసాగాయి. గ్రామస్థులు, వీడీసీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు ఉపాధ్యాయ బృందాన్ని, విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులను సన్మానించి, విద్యార్థులకు మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు, అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

గ్రూప్- 2 మాక్ టెస్ట్ దరఖాస్తుకు నేటి వరకు గడువు

నిర్మల్ కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : టీజీపీఎస్సీ గ్రూప్- 2 నిర్వహించే మాక్ టెస్టులకు హాజరయ్యేందుకు శుక్రవారం గడువని జిల్లా మైనారిటీ శాఖ అధికారి మోహన్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన్, బౌద్ధ యువత ఈ అవకాశం వినియోగించుకోవాలన్నారు. డిసెంబరు 3, 10 తేదీల్లో ఉదయం 10:30 నుండి సాయంత్రం 4:30 వరకు రెండు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఖానాపూర్‌లో ట్రెయినీ ఐఏఎస్, ఐపీఎస్‌ల పర్యటన

ఖానాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గురువారం ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్‌లు పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ శాఖల విధి విధానాలు, వాటి పనితీరుపై అధ్యాయనం చేశారు. ఇందులో భాగంగా ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మున్సిపల్ కార్యాలయాలను వారు సందర్శించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న కోర్సులు, సౌకర్యాలు, కళాశాల నిర్వహణ తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బృందం పట్టణ పరిధిలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులతో పాటు పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ వేర్వేరు కార్యక్రమాలలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ హమీద్, తదితరులున్నారు.



ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ట్రెయినీ ఐఏఎస్, ఐపీఎస్‌ల బృందం

కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

నిర్మల్ కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. దిలావర్‌పూర్ మండలంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చి ఇప్పుడు అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిందిస్తోందని నాయకులు ఆరోపించారు. అయినా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుందని అన్నారు. నాయకులు నాందేడపు చిన్ను, అజహర్ హుస్సేన్, కౌన్సిలర్ ఇమ్రానుల్లా, నల్లూరి పోశెట్టి, కొండా శ్రీనివాస్, మతిన్, అయ్యన్నగారి పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఇథనాల్ పరిశ్రమ రద్దు పట్ల

మాజీ మంత్రి ఐకే రెడ్డి హర్షం

నిర్మల్ కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని దిలావర్‌పూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేయబోయే ఇథనాల్ పరిశ్రమ అనుమతులు రద్దు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో నాలుగు గ్రామాల రైతుల పోరాట ఫలితంగా ప్రజాప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇథనాల్ పరిశ్రమ రద్దు చేసినట్లు ఉత్తర్వులివ్వండి

- మంత్రి శ్రీధర్‌బాబును కలిసి విజ్ఞప్తి చేసిన రైతులు



హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం ఇస్తున్న దిలావర్‌పూర్ రైతులు

దిలావర్‌పూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇథనాల్ పరిశ్రమ రద్దు చేసినట్లు ప్రభుత్వం వెంటనే ఉత్తర్వులు ఇచ్చి ప్రజల్లో నమ్మకం కలిగించాలని దిలావర్‌పూర్ ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు గురువారం రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లను విజ్ఞప్తి చేశారు. జిల్లా కాంగ్రెస్ నాయకుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు హైదరాబాద్ బయలుదేరారు. ఈ సందర్భగా మంత్రిని కలిసి ఇథనాల్ పరిశ్రమను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుకు, జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. అయితే ప్రజల్లో ఇంకా ఇథనాల్‌పై అనుమానాలున్నాయన్నారు. రద్దు చేసినట్లు ఉత్తర్వులు ఇస్తే ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. వీలైనంత తొందరలో ఉత్తర్వులు ఇవ్వాలని వారు కోరారు. త్వరలో ఉత్తర్వులు ఇస్తామని రైతులు ఆందోళన చెందవద్దని మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.


పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌ను కలిసిన రాజేశ్వర్‌రెడ్డి



మహేష్‌కుమార్‌గౌడ్‌తో మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌ను గురువారం జిల్లా జడ్పీటీసీల ఫోరమ్ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి కలిశారు. దిలావర్‌పూర్ మండలంలో ఇథనాల్ పరిశ్రమ రద్దుకు తీసుకున్న నిర్ణయం పట్ల మహేష్‌కుమార్, సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు దిలావర్‌పూర్ మండలానికి చెందిన రైతులు పీసీసీ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

మీ ఉద్యమ స్ఫూర్తికి సెల్యూట్ : ప్రజాకవి జయరాజ్



దిలావర్‌పూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సహనం, సంయమనం పాటిస్తూనే ఉద్యమాన్ని నడిపి విజయం సాధించిన దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల ప్రజలకు సెల్యూట్ చేస్తున్నానని ప్రముఖ కవి జయరాజ్ అన్నారు. ఉద్యమకారులను కలిసి అభినందించేందుకు వచ్చిన జయరాజ్ ముందుగా బన్సపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను అభినందించారు. తెలియక ఇథనాల్ పరిశ్రమ వారి నుంచి విద్యా సంబంధిత సామాగ్రి తీసుకున్న విద్యార్థులు ఆ తర్వాత వెంటనే వాటిని తిరిగి ఇచ్చేయడం అభినందనీయమన్నారు. తర్వాత దిలావర్‌పూర్ వచ్చిన జయరాజ్ అందుబాటులో ఉన్న ఉద్యమకారులను కలిసి అభినందించారు. ప్రపంచ చరిత్రలో వివిధ పరిశ్రమల రద్దుకు పోరాటం చేసి విజయం సాధించడం చాలా అరుదు అని, సాధారణంగా సాధ్యం కూడా కాదన్నారు. కానీ దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల మహిళలు, పిల్లలు, యువకులు, వృద్ధులు అనే తేడా లేకుండా రాజకీయాలకు అతీతంగా పోరాటం చేసి విజయం సాధించడం సాధారణ విషయం కాదన్నారు. అందులోను ఎంతో సహనం, సంయమనం, సమన్వయంతో ఉద్యమాన్ని నడపడం చాలా గొప్ప విషయమన్నారు. మీ ఉద్యమ స్ఫూర్తికి చేతులెత్తి నమస్కరిస్తున్నానని అన్నారు. మీ ఐక్యత ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నానని అన్నారు.

నెలాఖరులోగా సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అన్ని వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితుల విశ్లేషణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వే వివరాలను నెలాఖరు వరకు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేస్తామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కొనసాగుతున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను గురువారం సాయంత్రం కలెక్టర్ పరిశీలించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆన్‌లైన్ వివరాలు నమోదు చేస్తున్న విధానాన్ని కలెక్టర్ పరిశీలించి, వారికి పలు సూచనలు చేశారు. సమాచార గోప్యతను పాటించాలని, ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా ఇంటింటి సర్వే వివరాలను ఒక్కో కుటుంబం వారీగా జాగ్రత్తగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. వివరాల నమోదులో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే అధికారుల దృష్టికి తేవాలని, సకాలంలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఇంటింటి సర్వే సందర్భంగా సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో వేగవంతంగా నమోదు చేయిస్తున్నామని, అన్ని మున్సిపాలిటీలు, మండలాలల్లో ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు జరుగుతోందని, ఈ నెలాఖరు డేటా ఎంట్రీని పూర్తి చేస్తామని తెలిపారు. తప్పిదాలకు తావులేకుండా అధికారుల పర్యవేక్షణలో, ఎన్యుమరేటర్ల సమక్షంలో ఆపరేటర్లచే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీవో జీవరత్నం, ఎంపీడీవో గజానంద్, ఎన్యుమరేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల్లో

నాణ్యమైన భోజనాన్ని అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్, సమావేశానికి హాజరైన కేజీబీవీల ప్రత్యేక అధికారులు, హెడ్ కుక్‌లు

నిర్మల్ అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో విద్యాశాఖ అధికారులు, కేజీబీవీల ప్రత్యేక అధికారులు, హెడ్ కుక్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని కేజీబీవీలలో చదివే ప్రతి విద్యార్థికి మెనూ ప్రకారం... నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఎస్‌వోపీ నిబంధనలను పాటిస్తూ ఆహారాన్ని వండాలన్నారు. మండలాల వారీగా కేజీబీవీలలో ఉన్న విద్యార్థుల సంఖ్య, వారికి అందిస్తున్న భోజన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వంటకు నాణ్యమైన కూరగాయలు, సరుకులు మాత్రమే వినియోగించాలన్నారు. కూరగాయల సరఫరా దారులు వసతి గృహాలకు నాణ్యమైన కూరగాయలు, చికెన్, మటన్, కోడిగుడ్లు, అరటి పండ్లు ఇతర సరుకులను సరఫరా చేయాలన్నారు. సరఫరా దారులు అందించిన వస్తువుల నాణ్యతను ప్రత్యేక అధికారులు పరిశీలించి, వస్తువుల నాణ్యత సరిగా లేనట్టయితే వాటిని వెనక్కి పంపించాలని తెలిపారు. కుళ్లిన, నిల్వ ఉంచిన కూరగాయలు, చికెన్, మటన్, కోడిగుడ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ వంటకు ఉపయోగించరాదన్నారు. అన్ని సరుకులను పరిశుభ్రంగా, ఎప్పటికప్పుడు సరఫరా చేయాలని తెలిపారు. కూరగాయలను నేరుగా నేలమీద ఉంచకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. వంటకు ముందు కూరగాయలను ఉప్పు నీటితో కడగాలని సూచించారు. పుచ్చులు, పురుగులు ఉన్న కూరగాయలను వంటకు ఉపయోగించరాదన్నారు. వంట గది, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్‌ను ఎప్పటికప్పుడు శుభ్రపరచుకోవాలన్నారు. వంటగదిలో దోమలు, ఈగలు, పురుగులు, బొద్దింకలు, బల్లులు, ఇతర కీటకాలు వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వంట మనుషులు ఎప్పటికప్పుడు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, వంటకు ముందు చేతులు, కాళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వంట చేసే సమయంలో తప్పనిసరిగా హెడ్‌క్యాప్, మాస్క్, ఆప్రాన్ ధరించాలన్నారు. వంట పాత్రలను డిష్ వాషర్లతో ఒకటికి రెండు సార్లు శుభ్రపరచాలన్నారు. వసతి గృహాల్లోని నీటి తొట్టిలను వెంట వెంటనే శుభ్రపరచాలని తెలిపారు. విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీటిని మాత్రమే అందించాలన్నారు. బియ్యం, పప్పు దినుసులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. వంట సరుకులు వసతిగృహానికి రాగానే వస్తువుల గడువు తేదీ ప్రత్యేక రిజిస్టర్లలో నమోదు చేసి ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు తీరిన వస్తువులను వంటకు ఉపయోగించరాదని తెలిపారు. విద్యార్థుల శారీర దృఢత్వానికై అందిస్తున్న రాగి జావా నాణ్యవంతంగా ఉండాలన్నారు. మరుగుదొడ్లను, వసతి గృహ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. ప్రతి వసతిగృహంలో 24 గంటల పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం జిల్లాలోని 18 కేజీబీవీలకు రెండేసి చొప్పున మొత్తం 36 ఇన్సునరేటర్ పరికరాలను అదనపు కలెక్టర్ చేతుల మీదుగా విద్యాశాఖ అధికారులకు అందజేశారు. ఇన్సునరేటర్ పరికరాలను అందించుటకు చొరవ చూపిన కలెక్టర్‌కు ఈ సందర్భంగా అధికారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో డీఈవో పి. రామారావు, అధికారులు సలోమి కరుణ, పద్మ, వెంకట రమణ, లింబాద్రి, అన్ని కేజీబీవీల ప్రత్యేక అధికారులు, వంట మనుషులు, సరుకుల సరఫరాదారులు, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నం ఘటనపై జిల్లా కలెక్టర్ ఆరా

ఖానాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పెంబి మాజీ సర్పంచ్ అరుగుల పూర్ణచందర్‌గౌడ్ బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆరా తీసినట్లు తెలిసింది. సదరు మాజీ సర్పంచ్‌కు ప్రభుత్వం నుండి రావలసిన బిల్లులు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో తెలుసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అభివృద్ధి పనులను చేసేందుకు అప్పులు తెచ్చి పని చేసిన పూర్ణచందర్ గౌడ్‌కు సుమారు రూ. 30 లక్షలకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో తాను చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపం చెందిన ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం విధితమే... ఈ నేపథ్యంలో గురువారం కలెక్టర్ పూర్ణచందర్ గౌడ్‌కు రావలసిన బిల్లులపై ఆరా తీయడంతో ఆయనకు రావలసిన బిల్లులు త్వరలోనే మంజూరు అయ్యే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

సంక్షిప్త సమాచారం

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న శ్రీహరిరావు

నిర్మల్ కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు గురువారం డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. 30 మంది లబ్ధిదారులకు 16 లక్షల 70 వేల చెక్కులు అందజేశారు. నిర్మల్ పట్టణం, లక్ష్మణచాంద, సోన్, మామడ, దిలావర్‌పూర్ మండలాలకు చెందిన వారు చెక్కులు అందుకున్నారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, నిర్మల్ ఏఎంసీ చైర్మన్ భీమ్‌రెడ్డి, సారంగాపూర్ ఏఎంసీ అబ్దుల్ హాది, పట్టణ అధ్యక్షుడు చిన్ను, ఆయా మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ అదుపు తప్పి ఒకరి మృతి

లోకేశ్వరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మోటార్ సైకిల్ అదుపు తప్పి దండేకర్ ఆనంద్ రావు మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. లోకేశ్వరం ఎస్సై అశోక్ వివరాల ప్రకారం... బుధవారం సాయంత్రం 5:30 నిమిషాలకు గొడిసెరా గ్రామానికి చెందిన దండేకర్ ఆనంద్ రావు తన మోటార్ సైకిల్ (హోండా యాక్టివా)పై నందిపేట గ్రామం నుండి తన సొంత గ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో పంచగుడి గ్రామం శివారులోని గోదావరి బ్రిడ్జి దాటిన తర్వాత ఎవరో గుర్తు తెలియని వ్యక్తి రోడ్డుపై ధాన్యం పోయగా, మృతిడి మోటార్ సైకిల్ ధాన్యం పైకి వెళ్లగా మోటార్ సైకిల్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయింది. మృతుడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మరణించాడు. మృతుడి భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రెండు మొరం టిప్పర్లు పట్టివేత



ముథోల్‌లో పట్టుకున్న మొరం టిప్పర్

ముథోల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను గురువారం పట్టుకున్నట్టు ముథోల్ సీఐ మల్లేష్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం మండల కేంద్రమైన ముథోల్ వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మొరం టిప్పర్‌ను పట్టుకొని ముథోల్ పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అలాగే భైంసా నుంచి బాసర వైపు వెళ్తున్న మరొక టిప్పర్ కూడా ఎలాంటి అనుమతి పత్రం లేకుండా తరలిస్తున్న టిప్పర్‌ను బాసర వద్ద పట్టుకొని బాసర పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సంబంధిత వాహనాలను రెవెన్యూ అధికారులకు అప్పజెప్పనున్నట్లు పేర్కొన్నారు.